

కథా కౌముది

# అందిన ఆకాశం

– శ్రీకళ అబ్బరాజు

"**ఆకాష్..**" పేరుకి తగ్గట్టు విశాలమైన వినీలాకాశంలా హుందాగా వుంటాడు. అతనిది చామనఛాయ. చురుకైన కళ్ళు. నొక్కులు నొక్కులుగా వుండే జుట్టు అతనిలో ప్రత్యేక ఆకర్షణ.

బిందు. మంచు బిందువులాగా స్వచ్ఛంగా, నిర్మలంగా వుంటుంది. పచ్చటి ఒళ్ళు పెద్ద కళ్ళతో ఆకట్టుకుంటుంది.

ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని వుంటే, మబ్బునీ, మెరుపునీ ఒక్కసారే చూసినట్టుంటుంది.

ఇద్దరు బావా మరదళ్ళు. అన్నింటికీ మించి మంచి స్నేహితులు. ఆకాష్‌కి జాబ్ వచ్చింది. అమ్మాయిలందరూ కోరుకునే ఫర్‌ఫెక్ట్ హజ్బెండ్ మెటీరియల్ అతను. అంతకన్నా ఏం కావాలి?

బాల్కనీలో పిట్టగోడకి అంటిపెట్టుకుని వున్నా, మనసు మాత్రం ఎటో వెళ్ళిపోయింది. నా వయసుకి సహజమైన చిలిపి ఊహల్లో బిందూనీ, ఆకాష్‌నీ చిత్రించే ప్రయత్నం చేస్తూ వున్నాను.

"హలో!" ఇంతలో మొహం ముందు చిటికె మోగింది.

"ఏంటీ? అంతలా ఆలోచిస్తున్నావ్?" ఎప్పుడు వచ్చాడో ఎదురుగా నిలబడి అడుగుతున్నాడు ఆకాష్.

ఉన్నట్టుండి ఉలిక్కిపడ్డట్టు నటించి పకపకా నవ్వాను.

"నాకు యిద్దరు కోతి ఫ్రెండ్స్ వున్నారు. వాళ్ళలో ఒక కోతి గురించి ఆలోచిస్తున్నాను" అన్నాను చిలిపిగా.

"ఆహా! ఆ కోతి నిన్ననే పూనే నుంచి వచ్చిందా?" అన్నాడు అతను కూడా నవ్వుతూ.

"భలే కరెక్ట్‌గా కనిపెట్టావ్. అవునూ ఫస్ట్ శాలరీ తీసుకున్నావుగా మా బిందూకి ఏం గిఫ్ట్ కొన్నావ్?" అడిగాను డిమాండింగ్‌గా చేతివేళ్ళని ఆడిస్తూ.

"బిందూ గురించి నీకెందుకు? నీకేం తెచ్చానో అడుగు" నిలుచున్న చోటు నుంచి నా వైపుకి దగ్గరగా జరుగుతూ అన్నాడు.

"అబ్బో! గిఫ్ట్ల పంపకం నాలాంటి వాళ్ళదాకా కూడా వచ్చిందంటే నీ చేతికి ఎముక లేదన్నమాటే. ఏదీ చూపించు" అన్నాను అరచేతిని ముందుకు చాపి సరదాగా.

అతను వెంటనే పాంటూ జేబులో నుంచి ఓ చిన్న నీలం రంగు డబ్బా తీసి నా చేతిలో పెట్టాడు.

అమెరికన్ డైమండ్స్ పొదిగిన ఖరీదైన గోల్డ్ ప్లేటెడ్ బ్రోచ్.

దాన్ని చూసి ఒక్క క్షణం నా కళ్ళు మెరిసినా వెంటనే, మొహం ముడిచేశాను.

"నో.. నాకొద్దు ఇది చాలా ఖరీదు వుంటుంది" ఠక్కున డబ్బా తీసి అతని చేతిలో పెట్టాను.

నా చెయ్యి వెనక్కి తీసుకునే లోపలే అతను చటుక్కున నా చేతిమీద అతని చేయి వేశాడు.

"ఖరీదు సంగతి నీకెందుకు? నాకు బావుందనిపించింది. అందుకే, నీకోసం తెచ్చాను..ప్లీజ్"

కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. అతని చూపుల్లో స్పర్శలో తేడావుంది.

ఒక్క క్షణం నా మెదడు స్తంభించిపోయినట్లైంది. చటుక్కున చెయ్యి విదిలించుకుని, బిందూ కోసం చూశాను.

చుట్టుపక్కల ఎక్కడా కనిపించలేదు.

"ఆకాష్ నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. చాలా మంచివాడు. హఠాత్తుగా ఎందుకిలా చేశాడు? మార్పు అతనిలో వుందా? నేను పొరపాటు పడుతున్నానా?" అప్రయత్నంగా ఆకాష్ వంక చూశాను.

నా తిరస్కారానికి అతని మొహం ముడుచుకుపోయి వుంది.

"మినీ" పై బాల్కనీలోనుంచి అమ్మ పిలిచింది. "త్వరగా! డిన్నర్ రెడీ"

ఆకాష్ వంక ఒకసారి చురుగ్గా చూసి, గబగబా మెట్లెక్కి మా యింటికి వచ్చేశాను.

ఇంట్లో అడుగుపెడుతూనే, మా అమ్మమ్మ ఎత్తుకుంది. "ఒక్క క్షణం యింట్లో కాలు నిలవదు దీనికి. ఎప్పుడూ ఫ్రెండూ, ఫ్రెండూ అంటూ ఆ కిందవాళ్ళ యింట్లో పడి వేళ్ళాడుతూంటుంది" అని సణిగి

"కాస్త వచ్చి నాకు మంచీళ్ళు తెచ్చివ్వవే" దోశె ముక్క నోట్లో కుక్కుకుంటూ నన్ను చూసి అరిచింది. విసుగ్గా వెళ్ళి, మంచినీళ్ళ గ్లాసు తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టాను.

"ఆ!! గొంతు పట్టుకుందంటే చేతికందివ్వకుండా పోతావూ! బాగున్నాయ్ నీ వేషాలు. పెళ్ళవనీ అప్పుడు తెలుస్తుంది నీకు" పెద్ద గొంతుతో అరిచింది.

అసలే ఆకాష్ ప్రవర్తనతో చిరాగ్గా వున్న నాకు ఛర్రున మండుకొచ్చింది. వెళుతున్నదాన్నల్లా ఠక్కున వెనక్కి తిరిగాను.

"పెళ్ళయితే ఏమవుతుందట? నీలాగాగానీ, నా మొగుడే మాట్లాడితే, మడతపెట్టి అలమరలో పెడతాను" కోపంగా చెప్పి మంచినీళ్ళ గ్లాసుని ఆవిడకి అందకుండా నెట్టి, కళ్ళెగరేశాను.

"మినీ యిట్రా" వంటింట్లో నుంచి అమ్మ పిలిచింది.

"ఎన్నిసార్లు చెప్పానే ఆవిడ మాటలు పట్టించుకోవద్దని. ఆవడవన్నీ పాతకాలం ఆలోచనలూ చాదస్తం" నెమ్మదిగా చెప్పింది.

"ఎప్పుడూ నాకేనా నీతిబోధలు ఆవిడగారికి చెప్పు, నా జోలికి రావద్దని" అన్నాను రోషంగా.

అమ్మ చేతిలో గరిటె పక్కన పడేసి, నా వైపుకి తిరిగింది. నా మొహం మీద పడుతున్న జుట్టుని పక్కకి తోసి, ప్రేమగా నా చెంపలు నిమిరింది.

"అది కాదమ్మా" అంటూ చెప్పబోతుంటే వెనకనుంచి మళ్ళీ అమ్మమ్మ అందుకుంది.

"ఆ! ఈ వేషాలకే మీ అమ్మని మొగుడు వదిలేశాడు. మడతపెట్టి అలమరలో పెడుతుందట. ఇంకా నయం ఏదో కొడుకులిద్దరి దగ్గర దర్జాగా, హాయిగా బతుకుతుండేదాన్ని తెచ్చి యిక్కడ కట్టిపడేశారు నన్ను. యశోదా దీన్ని మాత్రం నీలా తయారు చెయ్యకు" నొక్కులు నొక్కింది

అమ్మ ఏదో చెప్పబోయినదల్లా చప్పున కళ్ళు దించుకుంది.

మా అమ్మమ్మని భరించడం మా అమ్మ బలహీనత. ఒక పక్క ఉద్యోగం యింకోపక్క నేను. ఒంటరి అల్లిగా అన్నీ సమర్ధించుకోలేక, తోడు కోసం అమ్మమ్మని తెచ్చి పెట్టుకుంది. పనివాళ్ళ మీద పెత్తనం చెయ్యడం, మా మీద నోరుపారేసుకోవడం. మా యింట్లో అమ్మమ్మ దినచర్య అదే.

మా అమ్మ అవసరానికి తెచ్చి పెట్టుకున్నా ఒక్కసారి కూడా వచ్చి తల్లిని తీసుకెళ్ళని మా మావయ్యలంటేనే మా అమ్మమ్మకి పంచప్రాణాలు.

ఇక, మా అమ్మమ్మ సోది ఒక్క నిముషం కూడా వినలేననిపించి, గబగబా నా గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను.

"మినీ, మినీ.."

అమ్మ పొద్దుటే నా గదిలోకి వచ్చింది.

"నిన్న ఆకాష్ వచ్చాడటగా! నాకు చెప్పలేదేం అయినా, యిక్కడిదాకా వచ్చినవాడు నన్ను చూడకుండా వెళ్ళడే" తనలో తను మాట్లాడుకుంటున్నట్టే అంది.

"రాకపోతే ..పోనీ! నువ్వెందుకు బాధపడడం?" అన్నాను నిర్లక్ష్యంగా.

"బాధ కాదే అభిమానం. ఎంతైనా నా ఫ్రెండు సుజీ కొడుకు. తల్లిలేని పిల్లాడు. మీలాగే నా కళ్లముందు పెరిగినవాడు. అందుకే తలుచుకుంటాను. అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. ఇందాక బిందూ ఫోన్ చేసింది. నీకు చేస్తే

తియ్యలేదట బైటికి వెళ్ళే ప్రోగ్రాం వుంది పదింటికల్లా నిన్ను రెడీగా వుండమని చెప్పింది" బట్టల అలమర సర్దుతూ చెప్పింది.

"నేను వెళ్ళను" మొహం మీద జుట్టుని వెనక్కి తోసుకుంటూ విసుగ్గా అన్నాను.

"మళ్ళీ బిందూతో గొడవగానీ పెట్టుకున్నావా?" వెనక్కి తిరిగి చూస్తూ అనుమానం వస్తే ఓ పట్టాన వదలదు.

సరిగ్గా, అప్పుడే మళ్ళీ నా సెల్‌ఫోన్ మోగింది.

స్క్రీన్ మీద 'బిందు' అన్న అక్షరాలు చూస్తూనే, "సర్లే వెళతాను" చెప్పి తయారవడానికి లేచాను.

నేనుఊహించినట్టే బిందూతోపాటు ఆకాష్ తయ్యారయ్యాడు. అసలిదంతా ఆకాష్ ప్లానే అయ్యుండవచ్చు అని అనిపించింది నాకు.

"ఇప్పుడు మనం నేరుగా, శ్రీరామ ధామానికి వెళ్ళి, అక్కడ్నుంచి హోటల్‌కి వెళ్ళి లంచ్ చేసి వస్తున్నాం" కారులో ఎక్కుతూనే ప్లాన్ ఎనౌన్స్ చేసింది బిందు.

‘ శ్రీరామధామం'లో రాములవారి ఆలయానికి అనుబంధంగా సంగీతం, నృత్యం, యోగా, మృదంగం, కీబోర్డులాంటివి నేర్పుతూ వుంటారు.

నేను, బిందూ అక్కడే సంగీతం నేర్చుకున్నాం. ఎప్పుడు అటువైపు వెళ్ళినా, 'శ్రీరామధామానికి' వెళ్ళాలని పట్టుపడుతుంది బిందు.

సరిగ్గా, యిరవై నిముషాల్లో అక్కడికి చేరుకున్నాం.

ఆలయం ప్రవేశద్వారం దాటి అడుగు లోపలికి పెడుతూనే, తాళం చప్పుళ్ళు, సరిగమలు, మృదంగం శబ్దాలూ అన్నీ కలబోతగా వినిపించాయి.

కాస్త ముందుకి వెళితే, ధ్వజ స్థంబం

దానికి రెండువైపులా కాస్త దూరంలో గుత్తులు, గుత్తులుగా విరగకాసిన సపోటా చెట్లు. వాటిని దాటితే, అరటి, మామిడి చెట్లతో నిండిన పెద్ద తోట పక్కనే తులసి వనం. తోట చూట్టూ, సంగీతం, భరతనాట్యంలాంటివి. నేర్పించేందుకు కట్టిన చిన్న చిన్న కుటీరాల్లాంటి గదులు. ఆకుపచ్చ మైదానంలో తెలుపూ, ఎరుపూ కలిసిన చిన్న చిన్న బొమ్మరిళ్ళలా వుంటాయివి.

ముందుగా రాములవారిని దర్శించుకుని వచ్చి అరటి చెట్ల దగ్గర గట్టుమీద కూర్చున్నాం ముగ్గురం. అప్పటికి సమయం పదకొండు అవుతూ వుంది. ఎండ కొద్దికొద్దిగా పైకెక్కుతూ వుంది.

గుడి ముఖమండపం ముందున్న రావిచెట్టు ఆకుల సందుల్లో నుంచి పడుతున్న ఎండ నేలమీద వెలుగు ముగ్గు వేసినట్టుగా వుంది.

అప్పటిదాకా, గోపురం చుట్టూ ఎగిరిన పావురాళ్ళు, చిన్నగా లోపలికి దూరి కువకువలుండడం మొదలు పెట్టాయి.

"ఇక్కడికి వస్తే, నిజంగా జీవితాన్ని ఫీలవుతున్నట్టు కనిపిస్తుంది కదూ" అన్నాను బిందూ నుద్దేశించి.

"అవును. నాకూ అలాగే అనిపిస్తుంది" జవాబుగా ఆకాష్ గొంతు వినిపించడంతో ఉలిక్కిపడ్డాను. చూస్తే పక్కన బిందూ కనిపించలేదు.

"అదిగో" నా సందేహాన్ని తీరుస్తూ చూపుడు వేలు చూపించాడతను.

దూరంగా ప్రసాదం కౌంటరు వైపుకి వెళుతూ కనిపించింది బిందు.

నిన్న రాత్రి ఆకాష్ పద్ధతిలో మార్పు అర్థమయ్యాక అతని పక్కన కూర్చోవడం యిబ్బందిగా అనిపించింది. అందుకే, అతన్ని పట్టించుకోనట్టు గబుక్కున సెల్‌ఫోన్‌లో తలదూర్చాను.

"మినీ..!"

నా చేతిలో సెల్‌ఫోన్ లాగేసి నా మొహంలోకి చూశాడు.

"మినీ నీకు ఎప్పట్నుండో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. కానీ, జాబ్ వచ్చేంతవరకు ఆగితే బావుంటుందనిపించి చెప్పలేదు యిప్పటిదాకా. నువ్వంటే నాకిష్టం మినీ. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నా మీద నీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

నేను గబుక్కున కూర్చున్నచోటి నుంచి లేచాను.

అతను నాకు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"బిందూకీ నాకు మధ్య ఏమీలేదు. నువ్వేమన్నా అలాంటి అపోహలో ఉన్నావేమో అని చెప్తున్నాను."

నా మనసులోని ఆలోచనల్ని పసిగట్టినట్టే చెప్పాడు.

బిందూకీ అతనికీ మధ్యనిజంగా ఏమీ ఉండకపోవచ్చు. ఒక అందమైన ప్రేమకథలో నాయికా, నాయికల్లాగా వాళ్ళని నేనే నా మనసులో ఊహించుకున్నా. మా అమ్మనీ, నాన్ననీ నేనెప్పుడూ అన్యోన్యంగా చూడలేదు. నా చుట్టూ ఉన్నవాళ్ళెవ్వరూ నాకు అలా అనిపించలేదు.

అందుకే నా ఆలోచనలలో సరిపోయే జోడీగా వాళ్ళిద్దరినీ నేనే ప్రతిష్టించుకున్నాను. ఎందుకంటే, నా వయసునీ, కోరికల్నీ, నేరుగా చూసుకోవాలంటే నాకు భయం.

మమ్మల్ని వదిలేసి పోయిన మా నాన్నని గుర్తుచేసుకుని ఏడ్చే మా అమ్మ, కత్తితో గుచ్చినట్టు వుండే మా అమ్మమ్మ మాటలు గుర్తుకు వస్తాయి.

అందుకే, నా పెళ్ళి గురించి ఆలోచించాలంటే నాకు భయం. ఇప్పుడు, ఆకాష్ అడిగిన ప్రశ్న నన్ను మళ్ళీ అద్దం ముందు నిలబెట్టింది.

"కానీ ఆకాష్ యూ ఆర్ సో పర్‌ఫెక్ట్. నీకు నేనే ఎందుకు కావాలి?" అడిగాను తడబడుతూ.

ఆకాష్ నవ్వాడు.

"నువ్వే ఎందుకూ అంటే? ఇందాకే చెప్పానుగా నువ్వంటే నాకిష్టం అని. కొన్ని రోజుల నుంచి కాదు కొన్ని సంవత్సరాల నుంచి.

నేనేదో ఫర్‌ఫెక్ట్ అనుకోకు. నీకు మా ఫ్యామిలీ గురించి తెలియదు. మా నాన్నకి ఆడవాళ్ళంటే చిన్నచూపు. మా అమ్మని బాగా కొట్టేవాడు. ఆరోగ్యంగా వున్న మా అమ్మ ఒకే ఒక్కరోజులో శవంగా మారడానికి కారణం మా నాన్నే.

ఒకరోజు మా నాన్న కొట్టిన దెబ్బలకి ఏడుస్తు, ఆస్పత్రికి వెళ్ళి శవంగా మారి తిరిగొచ్చింది మా అమ్మ" చెబుతూ వుంటే అతని గొంతు జీరబోయింది.

"ఆకాష్! ఐ యామ్ సారీ" ఓదార్పుగా అన్నాను.

"ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడిదాకా వెళ్ళాము" అనుకుంటూ.

"ఇదంతా నీకు తెలియాలనే చెబుతున్నాను సిరీ. ఇప్పటికీ మా నాన్నలో మార్పులేదు. ఆయన మాటలూ, భాష అసహ్యంగా వుంటాయి. ఆయన్ని భరించలేనూ, వదిలించుకోనూ లేను. నువ్వేదో నన్ను పర్‌ఫెక్ట్ అనుకుంటున్నావుగానీ నిజానికి మా నాన్న గురించి తెలిసినవాళ్ళెవ్వరూ నాకు పిల్లనివ్వరు." అన్నాడు నీరసంగా నవ్వి.

నేను మాట్లాడలేకపోయాను.

"నా గురించి అంతా నీకు చెప్పాను. ఈ కారణాలు వేటితో అనుబంధం లేకుండానే నేను నిన్ను ప్రేమించాను. ఇక నిర్ణయం నీది" నిజాయితీగా చెప్పాడు.

అతను చెప్పింది విన్న తర్వాత నాకు మరింత భయం వేసింది. నా జీవితానికి యింత పెద్ద ఛాలెంజ్ అవసరమా? అనిపించింది.

బుర్ర అంతా గజిబిజిగా అయిపోనట్టుండడంతో, మరో మాట లేకుండా గబుక్కున అక్కడ్నుంచి వచ్చేశాను.

రెండు రోజులపాటు యిల్లు కదల్లేదు నేను.

బిందూ ఫోన్ చేసినా ఎత్తలేదు. అమ్మకి ఈ విషయం చెప్పలేదు. మూడోరోజు బిందూయే యింటికి వచ్చింది. అమ్మతో మాట్లాడింది ఆకాష్, బిందూ తోడు దొంగలని ఆ రోజు తెలిసింది నాకు.

ఆ తర్వాతి రోజు ఆకాష్ వచ్చాడు.

ఆకాష్ అంటే అమ్మకి యిష్టం.

నా మనసు పొరల్లోకి తొంగిచూస్తే అతనంటే నాకూ యిష్టమేనని తెలుసు.

అమ్మ, బిందూల ప్రోద్భలంతో, నా మనసులోని భయాల్నీ, అపోహల్నీ పక్కకి తోసి పెళ్ళి 'ఊ' అన్నాను.

పెళ్ళి, శ్రీరామధామంలో సాదాసీదాగా చేయాలని నిర్ణయించారు. పెళ్ళికి రెండు రోజుల ముందు మా యిద్దరు మేనమామలూ సకుటుంబంగా వచ్చారు.

మా అమ్మమ్మ ఆనందానికి అవధులు లేవు. నేను అత్తారింటికి వెళ్ళిపోతున్నానన్న బాధ ఆమెలో ఏ కోశానా లేదు. కొడుకులకీ, మనవళ్ళకీ అన్నీ సవ్యంగా జరుగుతున్నాయా లేదా అన్న ఆరాటమే ఆవిడకి.

పెళ్ళిరోజు రానే వచ్చింది.

తలంబ్రాల చీర కట్టుకున్న తర్వాత, ముత్తైదువలు పెళ్ళి మండపం దగ్గరకి నడిపించుకుని వెళుతున్నారు నన్ను. మనసులో భయానికీ, ఆత్రుతకీ చీరకుచ్చిళ్ళు పాదాలకి తట్టుకుంటున్నాయి.

తెల్లటి పట్టుపంచెలో ఆకాష్ పీటలమీద కుర్చుని కనిపించాడు. అతని మొహం చూస్తూనే మనసులో కొత్త ధైర్యం పుట్టుకొచ్చినట్టనిపించింది.

'ఈడూ – జోడూ' బావుంది నా పక్కనున్న పెద్దావిడ అంటూ వుంది.

"ఆ! ఎన్నాళ్ళ సంబరమో ఈ కాపురం అదీ చూద్దాం వాళ్ళమ్మ పోలికలు రాకుండా వుండొద్దూ" అత్తయ్య అంటూ వుంది.

"నా కాపురాన్ని నిలబెట్టుకోవడం యిప్పుడు నా మీద వున్న పెద్ద బరువన్నమాట" కొత్త విషయం అర్ధమైంది నాకు.

మాంగల్యధారణ పూర్తయ్యింది.

కొంగు ముడులు పడ్డాయి. ఇద్దరం కలిసి ఏడడుగులు నడిచాము.

ఇంతలో పందిట్లో కలకలం. ఆకాష్ వాళ్ళ నాన్న అమ్మని అరుస్తున్నాడు. ఆయనకి మర్యాదలు తక్కువయ్యాయట. ఆయన వాడుతున్న పదజాలం చూసి బిత్తరపోయారంతా, అమ్మ నిస్సహాయంగా ఆయన ముందు నిలబడి వుంది.

అమ్మనలా చూడలేకపోయాను. ఛర్రున కోపం వచ్చింది. నిలుచున్న చోటినుంచి కదిలి ఏదో అనబోయేటంత్లో ఆకాష్ చెయ్యి పట్టుకుని ఆపాడు.

"మినీ ప్లీజ్ ఇప్పుడు కాదు. నువ్వు కల్పించుకుంటే యింకా రాద్ధాంతం అవుతుంది" బతిమాలాడు.

నేను ఆగిపోయాను.

"పాపం ఎలా వేగుతుందో ఏంటో" నా చుట్టు వున్నవాళ్ళ జాలిగొలిపే చూపులు నన్ను గుచ్చుకున్నాయి.

చీరకొంగున వేసిన ముడి ఎంత బరువో తెలిసొచ్చింది ఆ క్షణం. అంపకాల తతంగం పూర్తయ్యాక, కారెక్కబోతుండగా అమ్మమ్మ వచ్చింది.

"వెళ్ళిన చోట జాగ్రత్తగా వుండవే. మీ మామ చూస్తే తిక్క మనిషిలా వున్నాడు. ఇంట్లో వేసే వేషాలు అక్కడ వెయ్యకు." అప్పటిలాగే మాట్లాడింది.

అమ్మ మాత్రం ఒక్కమాట కూడా మాట్లాడలేదు. మౌనంగా నన్ను గుండెలకి హత్తుకుంది.

అందరికీ ఆశ్చర్యం కలిగించేట్టు ఎటువంటీ ఫ్లాష్ న్యూస్‌లు రాకుండానే మా కాపురం మొదలై అప్పుడే ఆర్నెల్లు అయిపోయింది.

పొద్దున తొమ్మిది గంటలయ్యింది. ఆకాష్ ఆఫీసుకి వెళ్ళేహడావిడిలో వున్నాడు. కాఫీ యిద్దామని వంటగదిలోనుంచి బైటికి వచ్చానప్పుడే. మా మావగారు ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నారు.

"ఆ పిల్లకి ఎంత పొగరనుకుంటున్నావు? పెద్దంతరం చిన్నంతరం లేనేలేదు" అంటూ మాట్లాడుతున్నవాడల్లా నన్ను చూస్తూనే ఠక్కున ఫోన్ కట్ చేశాడాయన.

నేను గదిలోకి వస్తూనే ఆకాష్ నన్ను చూసి పకపకా నవ్వాడు.

"ఆర్నెల్లలోనే మా నాన్నని ఎంత భయపెట్టావు. నిన్ను చూడగానే ఠక్కున మాట్లాడ్డం ఆపేశాడు. ఏమో అనుకున్నాను. నువ్వు అందాల రాక్షసివే" అన్నాడు నవ్వుతూ.

నాకు పెళ్ళైన తర్వాత ఈ యింట్లోకి అడుగుపెట్టినప్పుడు ఆకాష్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"మినీ! మా నాన్న గురించి నాకు తెలుసు. నీ గురించి కూడా నాకు తెలుసు. ఆయనకీ, నీకు మధ్య నేను అడ్డురాను. నీ మర్యాద నీ గౌరవం నువ్వే కాపాడుకో. ఆయన్ని మామగారుగా గౌరవించడం కష్టం అని నాకు తెలుసు. కానీ, ఓ వయసు మళ్ళిన వ్యక్తిగా ఆయన్ని జాగ్రత్తగా చూసుకో ద్వేషించకు" ఆ మాటలు నాకెంతో ధైర్యాన్నిచ్చాయి.

నాకూ, మా మామగారికీ మధ్య ఎప్పుడు గొడవ జరిగినా ఆకాష్ కలిపించుకోలేదు. ఆకాష్ మాటల్ని గౌరవించి, నేనూ ఆయన్ని జాగ్రత్తగానే చూసుకుంటున్నాను.

నిజంగా ఆకాష్ నా జీవితంలోకి రావడం నేను చేసుకున్న అదృష్టం. నేను ఆలోచనల్లో కొట్టుకుపోతుండగానే,

"హలో! ఏంటి అంతలా ఆలోచిస్తున్నావ్?" మొహం మీద చిటికె వేశాడు.

"ఏం లేదు" చిన్నగా నవ్వి కాఫీ కప్పు అందించాను. సరిగ్గా అప్పుడే అమ్మ ఫోన్ చేసింది.

"మినీ అమ్మమ్మకి సీరియస్‌గా వుంది. ఏ క్షణమో, ఏమో అన్నట్టుంది పరిస్థితి. ఒక్కసారి వచ్చి చూసి వెళ్ళు" చెప్పింది.

వెంటనే పూనే నుంచి ఫ్లైట్ పట్టుకుని హైదరాబాద్ చేరాను. అప్పటికే, హాస్పిటల్‌లో చేరి రెండురోజులయ్యింది. మనిషి బాగా పీక్కుపోయి వుంది గొంతు మాత్రం తగ్గలేదు.

"వచ్చావుటే" అంది నన్ను చూస్తూనే.

నేను వెళ్ళి ఆమె పక్కన కుర్చీలో కూర్చున్నాను.

"మీ మామయ్యలు వచ్చారా?" అడిగింది ఆరాటంగా.

"లేదన్నట్టు" తలుపాను.

"వాళ్ళకి ఆఫీసుల్లో సెలవు దొరికి వుండదు. వాళ్ళు చేసేవి పెద్ద ఉద్యోగాలు. ఎంత బాధ్యత వుంటుంది" కొడుకుల్ని సమర్ధించింది.

అమ్మమ్మ అడ్డం పడినప్పటినుంచి, అమ్మ పసిబిడ్డని చూసుకున్నట్టు చూసుకుదావిడని. అయినా ఆవిడ ప్రాణం అంతా కొడుకుల మీదే కొట్టుకులాడుతూ వుంది. ఆమెని ప్రేమించే వాళ్ళని ఏనాడూ గుర్తించలేదావిడ. అయినా ఆవిడ మీద నాకు కోపం రాలేదు. జాలి కలిగింది.

చివరికి, కొడుకుల కోసం కలవరిస్తూనే వాళ్ళని చూడకుండానే కన్నుమూసింది అమ్మమ్మ.

హైదరాబాదులో పదిరోజులు వుండి పూనే తిరిగి వచ్చేశాను. ఎంత వద్దనుకున్నా అమ్మమ్మని గురించిన ఆలోచనలు పదే పదే మనసుకి వస్తూ వున్నాయి.

చివరి నిముషంలో కూడా మారని ఆమె వైఖరి గుర్తుకు వస్తే మనసుని ముల్లుతో గుచ్చినట్టు అనిపిస్తూ వుంది.

ఆ సంగతే ఆకాష్‌తో అన్నాను.

ఆకాష్ ఒక్క నిముషం ఆలోచించి తర్వాత చెప్పాడు.

"మినీ మీ అమ్మమ్మకి, మీ అమ్మ భర్త లేకుండా ఒంటరిగా బతకడం అవమానం.

ఆమె చూసిన సమాజం అలాంటిది. ఆ ముద్రనుంచి ఆమె బైటపడలేకపోయింది. అందుకే, మీ అమ్మ చూపించిన ప్రేమనీ, ఆప్యాతనీ గుర్తించలేదు. మీ అమ్మదగ్గర వుండడం ఆమెకి యిష్టంలేదు. మనిషి తనకి యిష్టంలేనని పరిస్థితుల్లో బతకాల్సి వచ్చినప్పుడు ఒక పక్కదారిని వెతుక్కుంటాడు.

వాసవానికి భిన్నంగా వుండే ఒక ఊహలో జీవిస్తాడు. అది ఒక సిద్దాంతం కావచ్చు, నమ్మకం కావచ్చు. భ్రమ కావచ్చు.

మీ అమ్మమ్మ కూడా అలాగే చేసింది. కూతురి జీవితం తను కోరుకున్నట్టు లేదు కాబట్టి.

దూరంగా వున్న కొడుకులు గొప్పవాళ్ళు, మంచివాళ్ళు అనే భ్రమ ఏర్పరుచుకుంది. దాన్నే నమ్మి, దాన్లోనే బతికింది. ఆఖరికి ఆ భ్రమలోనే చచ్చిపోయింది" ఆకాష్ తనదైన కోణంలో విశ్లేషించాడు.

అది నాకూ నిజమేననిపించింది.

చాలాసేపు దాని గురించే ఆలోచించాను.

నిజానికి, ఆకాష్ చెప్పినదానికి నేనూ  అతీతురాల్ని కాదు. అమ్మ జీవితాన్ని, అమ్మమ్మ ఒకరకంగా తీసుకుంటే, నేను యింకో విధంగా అర్ధం చేసుకున్నాను.

'పెళ్ళి' అన్నమాట వినడానికే యిష్టపడలేదు. అత్తయ్యలు, అమ్మమ్మలాంటి వాళ్ళ మాటలకి భయపడ్డాను. పెళ్ళిచేసుకున్న తర్వాత కాపురాన్ని నిలబెట్టుకోవాలన్న వత్తిడిని నాకు నేనే తీసుకున్నాను.

నాకు తెలియకుండానే సమాజం వేసిన ముద్రలని మోశాను.

ఆకాష్ చెప్పింది విన్న తర్వాత నా పొరపాటు నాకు అర్ధమైంది. అమ్మ జీవితంలో ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. అంతే దాన్ని అంతటితో వదిలేయాలి. కానీ నేను దాని చుట్టూ నా భయాలతో, సిద్ధాంతాలతో పిచ్చిగీతలు గీసుకుని అందులోనే యిరుక్కుపోయాను. నా పట్టుదల సడలి ఆకాష్‌ని పెళ్ళిచేసుకున్నాను కానీ లేకపోతే మా అమ్మమ్మకి యింకో నమూనాగా మిగిలిపోయేదాన్నేమో?

"హలో వూరికే అలా ఏదో లోకంలోకి వెళ్ళిపోతుంటావా నువ్వు?" ఆకాష్ నా మోం మీద చిటికె వేయడంతో నా ఆలోచనలు తెగిపోయాయి.

ఎదురుగా నవ్వుతూ వున్న అతని మొహం చూస్తుంటే మొదటిసారిగా 'అదృష్టాన్ని' నమ్మాలనిపించింది.

“ఏంటలా చూస్తున్నావ్?" కళ్ళెగరేశాడతను.

జవాబుగా, అతనికి మరింత దగ్గరగా జరిగి అతని గుండెల మీద వాలిపోయాను.

COMMENTS